# సాక్షి
## తూర్పుగోదావరి

బుధవారం । 27 । సెప్టెంబర్ । 2023






**నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం**

ఆత్రేయపురం : వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి నిత్యాన్నదాన పథకానికి జంపన కృష్ణంరాజు, బంగారమ్మ దంపతులు (మురమళ్ల) రూ.లక్ష విరాళం అందించినట్టు ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.



**కాలువలకు నీరు**

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పు డెల్టాకు 4,700,మధ్య డెల్టాకు 2,000,పశ్చిమ డెల్టాకు 7,000క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భద్రాచలం వద్ద 32.20అడుగులకు నీటి మట్టం చేరింది.

**బాలలూ.. ప్రాజెక్టులు రూపొందిద్దామా..!**

నేటి బాలలే..భవిష్యత్ శాస్త్రవేత్తలు అవుతారన్నది అక్షర సత్యం. ఈ విషయాన్ని అబ్దుల్ కలాం వంటి శాస్త్రవేత్తలు నిరూపించారు.



II లో

## న్యూస్‌రీల్

### నేడు జగనన్నకు చెబుదాం వాయిదా

సీటీఆర్‌ఐ(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం రూరల్ పరిధిలో బుధవారం నిర్వహించ తలపెట్టిన జగనన్నకు చెబుదాం మండల స్థాయి కార్యక్రమం వాయిదా పడింది. జిల్లా కలెక్టర్ మాధవీలత మంగళవారం ఈమేరకు ఒక ప్రకటనలో తెలిపారు. తర్వాత ఎప్పుడు నిర్వహించేదీ త్వరలో తెలియ చేస్తామని పేర్కొన్నారు.

### రోడ్ కం రైల్ బ్రిడ్జిపై వాహనాలు దారి మళ్లింపు



రాజమహేంద్రవరం సిటీ: రోడ్ కం రైల్వే బ్రిడ్జి మరమ్మతుల నేపథ్యంలో ఆర్టీసీ బస్సులతో పాటు అన్ని వాహనాల రాకపోకలను దారి మళ్లించినట్టు జిల్లా ఎస్పీ జగదీష్, రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్నం మంగళవారం వేరువేరు ప్రకటనల్లో తెలిపారు. బుధవారం నుంచి అక్టోబరు 26వ తేదీవరకూ ఈ బ్రిడ్జిపై రాకపోకలు పూర్తి స్థాయిలో నిలిపివేస్తున్న సంగతి తెలిసిందే. బ్రిడ్జిపై నుంచి వచ్చే కొవ్వూరు, ఏలూరు, జంగారెడ్డిగూడెం డిపోల బస్సులు ఈ నెల రోజులూ గామన్ బ్రిడ్జి, కాతేరు, కంబాల చెరువు మీదుగా రాజమహేంద్రవరం డిపోకు రాకపోకలు సాగిస్తాయన్నారు. తాడేపల్లి గూడెం, తణుకు, నిడదవోలు డిపోల బస్సులు విజ్జేశ్వరం బ్యారేజి, బొబ్బర్లంక, ధవళేశ్వరం, రైల్వేస్టేషన్, కోటిపల్లి బస్‌స్టాండు మీదుగా రాజమహేంద్రవరం కాంప్లెక్సుకు రాకపోకలు సాగిస్తాయన్నారు. ఈ మార్పును ప్రయాణికులు గమనించి సహకరించాలన్నారు.

### జనవరి 5 నాటికి తుది ఓటర్ల జాబితా

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): కేంద్ర ఎన్నికల కమిషన్ సూచించిన రీవైజ్డ్ షెడ్యూల్‌కి అనుగుణంగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, డ్రాఫ్ట్ పబ్లికేషన్, తుది ఓటరు జాబితా ప్రచురణ పూర్తి చేస్తామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత తెలిపారు. తుది ఓటర్ల జాబితాను 2024 జనవరి 5వ తేదీ నాటికి ప్రచురించడం జరుగుతుందన్నారు. స్పెషల్ రేవైజ్డ్ సమ్మరీ, తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎం.ముకేష్ కుమార్ మీనా మంగళవారం సాయంత్రం కలెక్టర్లతో సమీక్షించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ మాధవీలత, డీఆర్వో జి.నరసింహులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు సంబంధించిన పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ కోసం ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా స్థాయి సమావేశంలో చర్చించి, వారు చేసిన సూచనలు పరిగణనలో తీసుకుంటామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 9 నాటికి సమగ్ర నివేదికను ఫారం 1 నుంచి 8 వరకు తయారు చేసి ప్రతిపాదనలు పంపుతామన్నారు. సప్లిమెంటరీ, సమగ్ర ముసాయిదా ఓటరు జాబితాకు సంబంధించి అక్టోబర్ 10 నుంచి 26 వరకు పనులను పూర్తి చేయడంతో పాటు అక్టోబర్ 27న ముసాయిదా జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 27 నుంచి డిసెంబర్ 9 వరకు వాటిపై అభ్యంతరాలను స్వీకరిస్తామని, డిసెంబర్ 26 నాటికల్లా పరిష్కారం చేస్తామన్నారు. జవాబుదారీతనంతో కూడిన ఓటరు జాబితాను జనవరి ఒకటి 2024 నాటికి సిద్ధం చేసి సమర్పించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# తొలి అడుగు విజయవంతం

- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం సక్సెస్
- కాతేరులో పైలట్ కార్యక్రమం
- రోగులందరికీ వైద్య పరీక్షలు
- పాల్గొన్న కలెక్టర్ తదితరులు



కాతేరు శిబిరంలో రోగి డేటాఎంట్రీ విధానంపై ఆరా తీస్తున్న కలెక్టర్ మాధవీలత



వృద్ధురాలి ఆరోగ్యాన్ని తెలుసుకుంటున్న కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా కాతేరులో మంగళవారం నిర్వహించిన పైలట్ వైద్యశిబిరం విజయవంతమైంది. శిబిరానికి వచ్చిన రోగికి తొలుత రిజిస్ట్రేషన్ చేసి హెల్ప్‌డెస్క్‌లోని వ్యక్తి సంబంధిత జనరల్ ఓపీలో ఉన్న ఇద్దరు పీహెచ్‌సీ వైద్యులు, సీహెచ్‌సీలోని ప్రత్యేక వైద్యనిపుణులు (జనరల్ మెడిసన్, పిడియాట్రీషియన్, గైనకాలిజిస్ట్, డెంటల్, కంటి) వద్దకు పంపించారు. అవసరమైన వారికి ఈసీజీ, రక్తపరీక్షలు చేయించారు. ఆ రిపోర్టులను పరిశీలించిన అనంతరం వైద్యులు మందులు పంపిణీ చేశారు. గతంలో కంటి పరీక్షలు చేయించుకున్న వారికి ఈ శిబిరంలో కళ్లజోళ్లను పంపిణీ చేశారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ పథకంలో రిఫరల్ ఆస్పత్రిలో చికిత్స చేయించనున్నారు. ప్రతి రోగికి సంబంధించిన కేర్‌షీట్, రిపోర్టులతో కూడిన ఒక బ్యాగును అందజేశారు. క్యాంప్‌లో 162 రకాల మందులు, 18 సర్జికల్ పరికరాలు, 14 రకాల ఎమర్జెన్సీ కిట్లు అందుబాటులో ఉంచారు.

**ప్రజారోగ్యమే లక్ష్యంగా..**

ప్రజారోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఈ నెల16వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రతి ఇంట్లో సర్వే చేసి, ప్రజల ఆరోగ్యంపై ఆరా తీసి, సమస్యలను గుర్తించి ఆరోగ్య సురక్ష యాప్‌లో నమోదు చేస్తున్నారు. సర్వేలో గుర్తించిన వివిధ సమస్యల బాధితులతో పాటు, వైద్య అవసరాలు ఉన్న వారికి జిల్లాలో ఈనెల 30వ తేదీ నుంచి 45 రోజుల పాటు 383 జగన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్‌లను 164 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, 21 అర్బన్ హెల్త్ క్లినిక్‌లలో నిర్వహిస్తారు. దీనిలో భాగంగా మంగళవారం కాతేరులో పైలట్ హెల్త్‌క్యాంప్‌ను నిర్వహించారు.

**ప్రజల చెంతకే వైద్యసేవలు : కలెక్టర్ మాధవీలత**

### వైద్యశిబిరంలో సేవలు

| | | |
|---|---|---|
| జారీచేసిన కూపన్లు | : | 480 |
| మొత్తం ఓపీ | : | 451 |
| ప్రీ రిజిస్టర్డ్ ఓపీ | : | 272 |
| స్పాట్ రిజిస్టర్డ్ ఓపీ | : | 179 |
| **స్పెషలిస్ట్ వైద్యసేవలు** | | |
| గైనిక్ (ఏఎన్‌సీ) | : | 32 |
| పీడియాట్రిక్స్ | : | 21 |
| ఎన్‌సీడీ ఓపీ | : | 149 |
| ఫిజీషియన్ | : | 82 |
| డెంటల్ | : | 31 |
| కంటి వెలుగు | : | 136 |
| ఆరోగ్యశ్రీ రిఫరల్ | : | 06 |
| ఈసీజీ | : | 26 |
| రక్తపరీక్షలు | : | 215 |

ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ప్రతి ఒక్క కుటుంబానికి వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని, ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల చెంతకే మెరుగైన వైద్యం తీసుకుని వెళ్లడం జరుగుతోందని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. కాతేరులోని జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష పైలట్ హెల్త్ క్యాంప్‌ను ఆమె సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల 30 నుంచి వైద్య శిబిరాలు సమర్థంగా నిర్వహించనున్నామన్నారు. తొలి రోజు 17 చోట్ల నిర్వహిణకు సమగ్ర సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు క్షేత్రస్థాయిలో గృహ సందర్శన చేసి, ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్షతో పాటు ఆరోగ్యశ్రీపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. అలాగే ఏఎన్ఎం, సీహెచ్‌ఓలు గృహ సందర్శన తేదీలను తెలిపిన అనంతరం ఏఎన్ఎం, ఆశ, వలంటీర్లు ఒక బ్యాచ్‌గా, సీహెచ్ఓ, వలంటీర్లు, ఆశ వర్కర్లు మరొక బ్యాచ్‌గా గృహ సందర్శన చేస్తారన్నారు. ఆ సమయంలో ఇంటి వద్దనే వారి సెల్‌ఫోన్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసి, ఎలా వినియోగించాలో తెలియజేస్తారన్నారు. పర్యవేక్షణ సమయంలో ఇంటి వద్దనే ఏడు రకాల పరీక్షలు చేసి, ఆరోగ్య వివరాల రిపోర్టును మొబైల్ యాప్‌లో నమోదు చేస్తారన్నారు. పరీక్షల రిపోర్టులు వైద్య శిబిరాలు నిర్వహించే తేదీ నాటికి డాక్టర్లకు అందుబాటులో ఉండేలా రూట్ మ్యాప్ సిద్ధం చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ సనత్ కుమారి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక, నియోజకవర్గ ప్రత్యేక అధికారి కేఎస్ జ్యోతి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు హరిబాబు, సంధ్య, డీఐవో రాజకుమారి, రాష్ట్ర పరిశీలకుడు నరేష్, ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుధాకర్, స్పెషలిస్టు వైద్యులు మోహనవంశీ, స్వాగత్, శ్రీనివాసరెడ్డి, టీవీ శ్రీధర్, శివకుమార్, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, తహసీల్దార్ టి.చిన్నారావు, కాతేరు పీహెచ్‌సీ వైద్యులు నాగదేవి, జగదీష్, డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయ అధికారులు రాజీవ్, అభిషేక్, మౌనిక, ఐసీడీఎస్ సూపర్ వైజర్ మేరీ, పంచాయతీ కార్యదర్శి కె.హనుమంతరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆచంట కల్యాణ్, యెజ్జు వాసు పాల్గొన్నారు.





ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహారం స్టాల్, వైద్యసేవలందిస్తున్న వైద్యురాలు

### పేదలకు ఒక వరం



తొలుత 104, ఆ తర్వాత ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చింది. ఇలాంటి ఆరోగ్యశిబిరాలు నిర్వహించడం పేదలకు ఒక వరం. ఏ చిన్న అనారోగ్యం చేసినా మందులు షాపులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా విలేజ్ హెల్త్ క్లినిక్‌లోనే ఏఎన్‌ఎంల దగ్గర మందులు తీసుకునే వెసులుబాటు దక్కింది. సీఎం జగన్‌మోహన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– జిట్ల అనంతలక్ష్మి, కాతేరు

### నిత్యం పర్యవేక్షణ



ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా నిత్యం వైద్యులు నన్ను పరీక్షిస్తున్నారు. మరో పక్క అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టికాహారం అందిస్తున్నారు. ఇప్పుడు జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ ద్వారా స్పెషలిస్ట్ వైద్యులు పరీక్షలు చేశారు. మందులు ఉచితంగా అందజేశారు. ప్రజలకు విద్య, వైద్యం అందించడానికి సీఎం జగన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

– పి.నాగమోహిని, గర్భిణి, కాతేరు

# జయలక్ష్మి సొసైటీ ఛైర్మన్ పదవీకాలం పెంపు





జయలక్ష్మి సొసైటీ నూతన కార్యవర్గం ఛైర్మన్, వైస్ ఛైర్మన్లుగా రెండవ సారి ఎన్నికైన త్రినాథరావు, రమణమూర్తి, మహాజనసభకు హాజరైన సభ్యులు

**సొసైటీ మహాజనసభ తీర్మానం**

కాకినాడ రూరల్: జయలక్ష్మి సొసైటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల పదవీకాలం మరో ఐదేళ్లు పొడిగిస్తూ మహాజనసభ తీర్మానించింది. కాకినాడ దంటు కళాక్షేత్రంలో మంగళవారం ఈ సొసైటీ రెండవ మహాజనసభ జరిగింది. దీనికి సొసైటీ ఛైర్మన్ త్రినాథరావు అధ్యక్షత వహించారు. గత ఏడాది సొసైటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్న నేపథ్యంలో రానున్న అక్టోబర్ 3వ తేదీ నాటికి ఛైర్మన్ త్రినాథరావు, వైస్ ఛైర్మన్ పీవీ రమణమూర్తిల పదవీకాలం ముగుస్తోంది. దీంతో మరో ఐదేళ్లపాటు వీరిద్దరినీ కొనసాగించేలా మహాజనసభ తీర్మానించింది. అలాగే చార్టెడ్ అకౌంటెంట్ నియామకం, కొత్తగా వివాదాల పరిష్కార కమిటీ ఏర్పాటు, డిపాజిటర్ల సొమ్ములో 40శాతం షేర్‌హోల్డర్, 60 శాతం సేవింగ్ అకౌంట్‌లో పొందుపరిచే అంశాలపై తీర్మానాలు చేసింది. ఏడాదిగా తాము చేపట్టిన కార్యక్రమాలు, వాటి నిర్ణయాలు, పురోగతిపై ఛైర్మన్ నివేదిక సమర్పించారు. గత పాలకవర్గంలో రుణాలు పొంది ఎగ్గొట్టినవారి వారికి సంబంధించిన 64 ఆస్తులను జప్తు చేశామన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని బాధితులకు సొమ్ము చెల్లించాల్సి ఉందన్నారు. మరికొన్ని ఆస్తులు జప్తునకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు రూ.5 కోట్ల వరకు వసూలు చేశామన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా చూస్తున్నామన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఏవీఎస్ కుమార్, సుబ్బారావు, గౌరీశంకరరావు, షేక్‌జానీబాషా, అముజూరి శ్రీనివాస్, స్వామిప్రసాద్, గవర్రాజు కుమార్, బాధితుల సంఘ నాయకులు బదిరీనాథ్, నర్సింగరావు, బాలు విశ్వనాథ్, రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మహాజనసభకు సుమారు 800 మంది సభ్యులు హాజరయ్యారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు విశాఖ, కృష్ణాజిల్లాకు చెందినవారు ఉన్నారు.

# పశుపోషణతో ఆర్థిక పురోగతి

- జేసీ తేజ్ భరత్, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ సుబ్బారావు
- జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ పథకంపై సదస్సు




జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ తేజ్ భరత్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు బూరుగుపల్లి సుబ్బారావు తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పశుపోషణతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు అన్నారు. స్థానిక వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ జిల్లాస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ పథకం ద్వారా గొర్రెలు, మేకలు, నాటుకోళ్లు, పందుల అభివృద్ధి యూనిట్లు, పాతరగడ్డి, సమీకృతదాణా తయారీ యూనిట్లను రాయితీపై మంజూరు చేస్తోందన్నారు. ఈ పథకంలో యూనిట్ల మేరకు రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల మేరకు రాయితీ ఉంటుందని తెలిపారు. యూనిట్ల నిర్వహణలో అనుభవం ఉన్న పశుపోషకులు, రైతు ఉత్పాదక సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, జాయింట్ లయబిలిటీ గ్రూపులు ముందుకు వస్తే, అర్హతను బట్టి లబ్ధిదారులను ఎంపిక చేస్తారన్నారు. ఈ పథకంలో రైతులకు రుణ సౌకర్యం కల్పించేందుకు యూనియన్, కార్పొరేషన్ బ్యాంకులు ముందుకు వచ్చాయన్నారు. ఆర్బీకేల స్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పూర్తిస్థాయిలో లక్ష్యాలను సాధించవచ్చునని, తద్వారా జిల్లాను పశుపోషణలో అగ్రగామిగా నిలపవచ్చునని జేసీ అన్నారు.

**రైతులకు అన్ని విధాలా సాయం**

జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు బూరుగుపల్లి సుబ్బారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆర్బీకేలను ఏర్పాటు చేసి సాగులో రైతులకు అన్ని విధాలా అండగా ఉంటున్నారన్నారు. జాతీయ లైవ్‌స్టాక్ పథకంపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి డాక్టర్ ఎస్‌టీజీ సత్యగోవింద్ మాట్లాడుతూ తమ కార్యాలయంలో ప్రత్యేక ఎన్ఎల్ఎం సంబంధిత హెల్ప్‌డెస్క్ నిర్వహిస్తామన్నారు. అనంతరం టెక్నికల్ అధికారి ఏవీ ప్రసన్న కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రత్యేక అధికారి, పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ బి.చంద్రమౌళి నాయక్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ డీవీ ప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, గొర్రెలు, మేకలు సహకార సంఘం జిల్లా అధ్యక్షులు దండుబోయిన వీర వెంకట సత్యనారాయణ మూర్తి, జిల్లా గొర్రెలు, మేకలు పెంపకం దారులు సహకార సంఘం అధ్యక్షుడు ఏవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# హరివిల్లు ఒడిలో అరుదైన విడిది!



### గోదావరి హొయలు

గోదావరి నదీ అందాల గురించి ఎంత వర్ణించినా తక్కువే. నది మధ్యలో లంక గ్రామాలు, వాటిలో సాగయ్యే పంటలు, ఇసుక తిన్నెలు, చెంగుచెంగున ఎగిరే కృష్ణ జింకలు, తెరచాప పడవలు, పంటులు, హౌస్‌బోట్లపై సాగే ప్రయాణం, నదీపాయలపై వంతెనలు.. గోదావరి కాలువలకు లాకులు, ఇలా చెప్పుకుంటూ పోతే గోదావరి హొయలు జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటాయి

- సప్తరకాలుగా ఆకర్షించే కోనసీమ
- చక్కని అనుభూతిని మిగిల్చే సోయగాలు
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

సాక్షి అమలాపురం: కోనసీమ అందాల సీమ. బంగాళాఖాతం తీరాన్ని ఆనుకుని.. సప్త నదీపాయల మధ్య కొలువైన సీమ. పచ్చని తివాచీ పరిచినట్టు ఉండే చేలు, కొబ్బరితోపులు, గోదావరి నదీ పాయలు, వంపులు తిరుగుతూ పారే పంట కాలువలు, తెరచాప పడవలు, ప్రసిద్ధి చెందిన దేవాలయాలు, చారిత్రక కట్టడాలు, మడ అడవులు, గోదావరి మధ్య లంక గ్రామాలు, మండువా లోగిళ్లు, రైతుల మకాంలు.. వీటన్నింటికీ మించి ఆత్మీయత, మమకారంతో కలిసిన ఆతిథ్యం ఇలా చెప్పుకుంటూ పోతే కోనసీమ పర్యాటకులకు స్వర్గధామం. రైతులు, కూలీలు, మత్స్యకారులు, మహిళల జీవనం విధానం, కట్టూబొట్టూ, పండగలు, పబ్బాలు, జాతరలు.. ఇలా ఇక్కడ అన్నింటా ఒక ప్రత్యేక ముద్ర. ఇటీవల కాలంలో గోదావరి, సముద్ర తీరంలో వెలుస్తున్న రిసార్ట్స్, రైతుల పొలాల వద్ద ఫామ్ హౌస్‌లు, పర్యాటక రంగానికి ప్రభుత్వ ప్రోత్సాహం వంటి చర్యల కారణంగా కోనసీమకు వచ్చే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. 'సప్త'వర్ణాల కోనసీమ.. పర్యాటకంగా కూడా 'సప్త'రకాలుగా ఆకట్టుకుంటోంది. సెప్టెంబరు 27 'ప్రపంచ పర్యాటక దినోత్సవం' సందర్భంగా కథనం.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం

**ఆధ్యాత్మికంగా..**

ఆధ్యాత్మిక రంగంలో కోనసీమ జిల్లాకు ప్రముఖ స్థానం ఉంది. లెక్కలేనన్ని ఆలయాలు, పురాణ ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాలు కోనసీమ సొంతం. వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయానికి ప్రత్యేక విమానాలలో భక్తులు వస్తున్నారు. వీటితోపాటు అంతర్వేది లక్ష్మీ నర్సింహస్వామి, మందపల్లి శనీశ్వర స్వామి, అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వరస్వామి, అప్పనపల్లి బాలబాలాజీ, ద్రాక్షారామం భీమేశ్వర స్వామి వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలకు వచ్చే వారి సంఖ్య ఏటేటా పెరుగుతోంది.

**బౌద్ధులు.. రాజుల చారిత్రక ఆనవాళ్లు**

చారిత్రాత్మక ప్రదేశాలలో పర్యాటకానికి వస్తే రామచంద్రపురంలో 17వ శతాబ్దం నాటి కోట ఉంది. మామిడికుదురు మండలం ఆదుర్రులో క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దం నాటి పురాతన బౌద్ధ స్థూపాలున్నాయి. కపిలేశ్వరపురం జమీందార్ల పురాతన భవనాలు, రాజుల కోటలను తలపించే మండువా లోగిళ్ల ఇళ్లు పర్యాటకులకు ముచ్చటగొల్పుతాయి.



రామచంద్రపురం కోట

**అగ్రి టూరిజం**

పర్యాటకంలో ఇటీవల కాలంలో మంచి ఆదరణ లభిస్తోంది అగ్రి టూరిజానికే. దేశంలో కేరళలో మొదలైన ఈ పర్యాటకం విస్తరిస్తోంది. పట్టణ ప్రాంతాల్లోని ఐటీ వంటి రంగాల్లో ఉన్నత ఉద్యోగాలు చేసేవారు ఒత్తిడి నుంచి బయటపడేందుకు అగ్రి టూరిజం బాట పడుతున్నారు. ఇటువంటి వారికి కోనసీమ అగ్రి టూరిజం ఒక అద్భుతం. పచ్చని తివాచీ పరచినట్టు ఉండే వరిచేలు, కొబ్బరి, అరటి తోటలు, లంక గ్రామాల్లో పలు రకాల పంటలు, పాడి, ఆక్వా చెరువులు, తోటల్లోని రైతుల మకాం (వ్యవసాయ శాలలు) విశేషంగా ఆకర్షిస్తాయి.



తీరం... అందాల హారం



### మైమరపించే మడ అడవులు

ఐ.పోలవరం మండలం భైరవపాలెం నుంచి అంతర్వేది సముద్ర తీరం వరకు నదీపాయలతోపాటు, మురుగునీటి కాలువలు సముద్రంలో కలిసే ప్రాంతాలలో ఉన్న మడ అడవులలో పర్యాటకం అద్భుతమనే చెప్పాలి. నదీ, కాలువ పాయల మధ్య మడ అడవులు మీదుగా సాగే ప్రయాణం మధురానుభూతిని పంచుతుంది.

**ఆతిథ్యం అద్భుతం**

అతిథి మర్యాదంటేనే గోదావరి జిల్లాలు. మరీ ముఖ్యంగా కోనసీమ ఆహారం.. ఆతిథ్యానికి ఫిదా అవ్వాల్సిందే. పర్యాటకుల జిహ్వ చాపల్యాన్ని తీర్చే రకరకాల స్వీట్లు, హాట్‌లు, టిఫిన్లు, బిర్యానీలు, మాంసాహార కూరలు ఎన్నో.. ఎన్నెన్నో. ఆత్రేయపురం పూతరేకులు.. అవిడి పాలకోవా, మినప రొట్టి, చెరుకుపానకం, పెసరెట్టు ఉప్మా, పనస పొట్టు కూర, ముద్దపప్పు.. గుమ్మడి పులుసు, ఉల్లి గారెలు... నాటు కోడి కూర, చుక్కపీత ఇగురు.. పులసల పులుసు ఇలా ఎన్నో రకాల వంటకాలు పర్యాటకులను లొట్టలు వేయిస్తాయి.

## క్లుప్తంగా

### రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఛరిష్మసాయి రుత్వి



అంబాజీపేట: రాష్ట్ర స్థాయి అండర్ -14 వాలీబాల్ పోటీలకు స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థిని నిమ్మకాయల ఛరిష్మ సాయి రుత్వి ఎంపికైనట్టు హెచ్‌ఎం కడలి సాయిరామ్ తెలిపారు. అంబాజీపేట హైస్కూల్‌లో సాయి రుతిని ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం అభినందించారు. అనపర్తిలో ఈ నెల 25న జరిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల వాలీబాల్ పోటీల్లో ఛరిష్మసాయిరుత్వి అత్యంత ప్రతిభ కనబర్చడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఛరిష్మసాయిరుత్వికి శిక్షణ ఇచ్చిన పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, ఆక్వా కమిటీ చైర్మన్ కామిశెట్టి మధుబాబులను పలువురు అభినందించారు. ఇటీవల బాస్కెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పాండిచ్చేరిలో నిర్వహించిన జాతీయ స్థాయి అండర్ -14 బాస్కెట్‌బాల్ పోటీలలో రాష్ట్ర జట్టుకు చరిష్మ ఎంపికైన విషయం తెలిసిందే. బాస్కెట్‌బాల్‌తో పాటు వాలీబాల్‌లో కూడా రాణించడం పట్ల ఉపాధ్యాయులు బి.వెంకటేశ్వరరావు, వి.సత్యనారాయణ, బీఎస్‌ఎన్ మూర్తి, విద్యార్థులు అభినందనలు తెలిపారు. అలాగే ముక్కామల జెడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఇసుకపట్ల సలోమి స్టాండ్ బైగా ఎంపికైనట్లు పీడీ ముత్యాల పవన్ కిషోర్ తెలిపారు.

### రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన మహేష్, అశోక్

రాజోలు: రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన చింతలపల్లి ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న యార్లగడ్డ మహేష్, కొల్లు అశోక్‌ను ప్రధానోపాధ్యాయుడు దొంగ జానకిరామయ్య మంగళవారం అభినందించారు. విజయవాడలో జరిగిన రెజ్లింగ్ పోటీల్లో అండర్-17 విభాగంలో 80 కేజీల కేటగిరిలో మహేష్ రజత పతకం సాధించగా, అశోక్ 71 కేజీల కేటగిరిలో కాంస్య మెడల్ సాధించాడని హెచ్‌ఎం వివరించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, పీఎంసీ చైర్మన్ నల్లి నాగబాబు, మండల ఉపాధ్యక్షుడు ఇంటిపల్లి ఆనందరాజు, వ్యాయామ ఉపాధ్యాయుడు చొప్పల చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

# బాలలూ..ప్రాజెక్టులు రూపొందిద్దామా..!

- 31వ నేషనల్ సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనకు సన్నాహం
- విద్యార్థులకు చక్కని అవకాశం
- పాఠశాలల నుంచి ప్రాజెక్టులకు ఆహ్వానం
- 29, 30 తేదీల్లో సైన్స్ టీచర్లకు జిల్లా స్థాయి ఓరియంటేషన్ తరగతులు

రాయవరం: నేటి బాలలే.. భవిష్యత్ శాస్త్రవేత్తలు అవుతారన్నది అక్షర సత్యం. ఈ విషయాన్ని అబ్దుల్ కలాం వంటి శాస్త్రవేత్తలు నిరూపించారు. తన గురువు సుబ్రహ్మణ్యన్ అయ్యర్ చెప్పిన సైన్స్ పాఠం డాక్టర్ అబ్దుల్ కలాం మిస్సైల్ మ్యాన్‌గా మారడానికి కారణమైంది. అందుకే చిన్నారుల చిట్టి మెదళ్లలోని గట్టి ఆలోచనలకు పదును పెట్టి, వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ఒక వేదికగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. చిరుప్రాయం నుంచే చిన్నారుల్లో శాస్త్రీయ ఆలోచనలు రేకెత్తించడానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌ను ఏర్పాటు చేయగా, రాష్ట్ర స్థాయిలో ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి (ఆప్‌కాస్ట్) ఆధ్వర్యంలో ప్రాజెక్టుల రూపకల్పనకు చర్యలు చేపడుతున్నారు. భారత శాస్త్ర సాంకేతిక విభాగం, రాష్ట్ర సాంకేతిక మండలి సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాల స్థాయిలో చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలను వెలికి తీయడానికి జిల్లా సైన్స్ కాంగ్రెస్ చక్కటి అవకాశాన్ని కల్పిస్తోంది.

రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి ఎంబ్లమ్

### ఐదు విభాగాల్లో పోటీలు

జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అన్ని యాజమాన్యాల పరిధిలోని 6-12 తరగతుల విద్యార్థులు 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్-2023లో పాల్గొనేందుకు అర్హులు. పాఠశాలలకు వెళ్లే వారితో పాటు 10 నుంచి 17 ఏళ్ల లోపు బడి మానేసిన వారూ ఇందులో పాల్గొనవచ్చు. జిల్లా స్థాయి వరకు 10-17 ఏళ్ల లోపు వారు పోటీల్లో పాల్గొనవచ్చు. రాష్ట్ర స్థాయి పోటీల్లో 10 నుంచి 14 ఏళ్ల లోపైతే జూనియర్లుగా, 14 నుంచి 17 ఏళ్ల లోపు వారిని సీనియర్లుగా విభజించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిశోధనలు, సృజనాత్మకతను ప్రోత్సహించి నిత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం చూపే ఆవిష్కరణలు సిద్ధం చేయించాలన్నదే జిల్లా సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనల ముఖ్య ఉద్దేశం. జిల్లా స్థాయి సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శన తేదీని త్వరలో తెలియజేస్తారు.



గతేడాది జిల్లా బాలల సైన్స్ కాంగ్రెస్‌లో విద్యార్థుల ప్రదర్శన

### ప్రాజెక్టులు సిద్ధం చేసుకోవాలిలా..

- జిల్లా బాలల సైన్స్ కాంగ్రెస్‌లో ప్రదర్శించే ప్రాజెక్టులు సైన్స్ సూత్రాలను ప్రదర్శించే నమూనాలుగా ఉండాలి. - విద్యార్థులు రూపొందించే ప్రాజెక్టులు ప్రధాన అంశానికి లోబడి, ఏదేని ఉప అంశానికి చెంది ఉండాలి.
- ప్రాజెక్టు ద్వారా సమస్యకు నిర్దిష్ట కాలంలో పరిష్కారాన్ని కనుగొనలేక పోయినప్పటికీ అధ్యయన పద్ధతి మాత్రం శాస్త్రీయంగా ఉండాలి.
- సమస్య అవగాహన, సృజనాత్మకత, నూతనత్వానికి ప్రాధాన్యమివ్వాలి.
- ఇద్దరు విద్యార్థులు టీమ్‌గా ప్రాజెక్టు నిర్వహించాలి.
- చక్కని శీర్షికతో, సంబంధిత నిర్దేశిత భౌగోళిక ప్రాంత పరిధిలో ప్రాజెక్టు నిర్వహించాలి. పరిశీలనలను తేదీల వారీగా లాగ్‌బుక్‌లో నమోదు చేయాలి. దత్తాంశాలన్నింటినీ విశ్లేషించాలి.
- పరిశోధన ఫలితాన్ని వివరించాలి. వ్యాఖ్యానించాలి..సమస్యకు పరిష్కారాన్ని సూచించాలి. ప్రాజెక్టు మొత్తాన్ని రిపోర్టు రూపంలో డాక్యుమెంట్‌గా రూపొందించి పోటీల్లో సమర్పించాలి.
- 250 పదాలకు మించకుండా ప్రాజెక్టు సంక్షిప్త రూపం రాయాలి.

29, 30 తేదీల్లో డివిజన్ స్థాయిలో అవగాహన

ఈ నెల 29న రామచంద్రపురం డివిజన్, 30న అమలాపురం డివిజన్‌లో జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో ప్రాజెక్టుల తయారీ, విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ఉపాధ్యాయులకు అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రామచంద్రపురం డివిజన్ స్థాయి సమావేశం శ్రీకృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాల, అమలాపురం డివిజన్ స్థాయి అవగాహన సమావేశం అమలాపురం మండలం కామనగరువులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి సారథ్యంలో ఈ సమావేశాలు నిర్వహించేందుకు జిల్లా సైన్స్ కాంగ్రెస్ ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా సైన్స్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ గిరజాల వెంకటసత్యసుబ్రహ్మణ్యం ఈ సమావేశాలకు కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారు. ప్రాజెక్టుల తయారీలో సూచనలు, సలహాలకు అకడమిక్ కోఆర్డినేటర్‌గా పీవీ బ్రహ్మానందం వ్యవహరించనున్నారు.

### ఇవీ ప్రధాన, ఉప ప్రధాన అంశాలు

- ఈ ఏడాది ఆరోగ్యం, శ్రేయస్సు కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడాన్ని ప్రధాన అంశంగా విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉంది.
- మీ పర్యావరణ వ్యవస్థను తెలుసుకోండి.
- ఆరోగ్యం, పోషణ, శ్రేయస్సును పెంపొందించడం.
- పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం కోసం సామాజిక, సాంస్కృతిక పద్ధతులు.
- స్వీయ ఆధారితం కోసం పర్యావరణ వ్యవస్థ ఆధారిత విధానం.
- పర్యావరణ వ్యవస్థ, ఆరోగ్యం కోసం సాంకేతిక ఆవిష్కరణలు ఉప అంశాలుగా తీసుకోవాలి.
- విద్యార్థులు ఈ ఐదు ఉప అంశాల్లో నమూనాలు సిద్ధం చేసుకోవచ్చు.

### దరఖాస్తు చేయాలిలా..

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌లో నమూనాలు ప్రదర్శించడానికి ఆయా పాఠశాలలు ముందుగానే ఆన్‌లైన్‌లో జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ గిరజాల వెంకటసత్య సుబ్రహ్మణ్యం(96401 88525)కు దరఖాస్తు చేసుకోవాలి.

### సైన్స్ టీచర్ల మార్గదర్శకత్వం



ప్రతి పాఠశాల నుంచి కనీసం రెండు నుంచి మూడు ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలి. ప్రాజెక్టులు రూపొందించే విద్యార్థులకు సైన్స్ టీచర్లే గైడ్ టీచర్లుగా వ్యవహరిస్తారు.

గిరజాల వెంకటసత్యసుబ్రహ్మణ్యం, జిల్లా కోఆర్డినేటర్, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్, అమలాపురం.


### ప్రతి పాఠశాల నుంచి తప్పనిసరిగా ప్రాతినిధ్యం



జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనలకు ప్రాతినిధ్యం తప్పనిసరిగా ఉండాలి. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు విద్యార్థులను సన్నద్ధం చేయడంలో హెచ్‌ఎంలు, సైన్స్ ఉపాధ్యాయులదే ప్రధాన బాధ్యత.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

## గణపయ్యో గైకొనవయ్యా నైవేద్యాలు!



మొగలికుదురులో కరెన్సీతో వినాయకునికి అలంకరణ



మోరిపాలంలో వినాయకునికి సమర్పించిన వంటకాలు

మామిడికుదురు: గణపతి నవరాత్ర వేడుకల్లో భాగంగా ఆదుర్రు శివారు మోరిపాలంలో విఘ్నేశ్వరునికి 190 రకాల వంటకాలు నివేదించారు. గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. 108 శివలింగాలకు అర్చన, జ్యోతిర్లింగార్చన ఘనంగా జరిగాయి. పలువురు భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. మొగలికుదురు జున్నూరి నగర్‌లో ఏర్పాటు చేసిన పృథ్వీ గణపతిని రూ.50 వేల విలువైన కరెన్సీ నోట్లతో అలంకరించారు. 100, 50, 20 నోట్లతో గణపతి మంటపాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

## మద్యం మత్తులో వ్యక్తి హత్య



పరబ్రహ్మశాస్త్రి (ఫైల్)

కొత్తపేట: మద్యం సేవిస్తుండగా ఇద్దరు స్నేహితుల మధ్య ఏర్పడిన వివాదం ఒకరి హత్యకు దారి తీసింది. కొత్తపేట మండలం మందపల్లి గ్రామంలో పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన కొమ్మూరి పరబ్రహ్మశాస్త్రి (41) హత్యకు గురైన దుర్ఘటనపై కొత్తపేట ఎస్సై వి.మణికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శాస్త్రి పిడుగురాళ్లలో ఆర్‌ఎంపీ వైద్యం చేస్తుండగా.. కాకినాడకు చెందిన గెడ్డం నాగభూషణం పిడుగురాళ్లలో ఒక రెస్టారెంట్‌లో పనిచేస్తున్నాడు. వారిద్దరి మధ్య మూడేళ్ల క్రితం స్నేహం ఏర్పడింది. ఈ నెల 24న పరబ్రహ్మశాస్త్రి తను సహజీవనం చేస్తున్న భవాని అనే మహిళ, కొందరు స్నేహితులతో పాటు నాగభూషణంతో కలిసి కాకినాడ వచ్చాడు. ఆ పరిసర ప్రాంతాల్లోని పలు దేవాలయాలను దర్శించుకుని 26న ఉదయం కొత్తపేట మండలం మందపల్లి ఉమా మందేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చాడు. రాత్రి ఆ గ్రామ సచివాలయం వద్ద పరబ్రహ్మశాస్త్రి, నాగభూషణం మద్యం సేవిస్తుండగా ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. నాగభూషణం మద్యం బాటిల్‌తో శాస్త్రి నుదురుపై కొట్టి, ఛాతిపై పొడిచాడు. శాస్త్రి కేకలు వేయడంతో అతనితో వచ్చిన వారు ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన శాస్త్రిని కొత్తపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అతను అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. ఈ విషయాన్ని వారు మృతుని భార్య శారదకు ఫోన్‌లో తెలిపారు. ఆమె వచ్చి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై మణికుమార్ కేసు నమోదు చేయగా రావులపాలెం సీఐ రజనీకుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

## 6 హోటళ్లకు నోటీసులు..
## రూ.36 వేల జరిమానా

అమలాపురంలో ఆహార భద్రతాధికారుల తనిఖీలు



ఓ హోటల్ వంటగదిలో తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాసరావు తదితరులు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో పరిశుభ్రత మార్గ దర్శకాలను పాటించని హోటళ్లు, స్వీటు దుకాణంపై జిల్లా ఆహార భద్రతా అధికారుల బృందం మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ బి.శ్రీనివాసరావు, జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వి.రుక్కయ్య ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఈ తనిఖీలు కొనసాగాయి. ఈ తనిఖీల బృందంలో డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయం నుంచి డాక్టర్ ఎస్.సునీల్, ఎంపీహెచ్‌ఈవో ఎం.రామలింగేశ్వరరావు ఉన్నారు. తనిఖీలు చేసిన ఆరు హోటళ్లు, ఒక స్వీటు దుకాణానికి పరిశుభ్రత పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారన్న కారణాలతో మొత్తం రూ.36 వేలు జరిమానా విధించారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేశారు. పట్టణంలోని గ్రీన్ ట్రీ, విష్ణుశ్రీ, దుర్గాస్, బొండం బాబాయ్, ఆర్య, గణపతి హోటళ్లు, గణపతి స్వీట్ షాపులను అధికారులు తనిఖీ చేశారు. పలు హోటళ్లల్లో వంట పదార్థాల తయారీ గదుల్లో పరిశుభ్రత సరిగా లేకపోవడంపై ఆహార భద్రతాధికారులు అసహనం వ్యక్తం చేశారు. సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాసరావు మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడుతో కలిసి మాట్లాడారు. నోటీసులకు వారం రోజులు గడువు ఇచ్చాం. హోటళ్ల యాజమానులు తాము తనిఖీల్లో గుర్తించిన లోపాలను ఆ గడువులోపు సరిదిద్దుకుంటే సరి. లేని పక్షంలో హోటళ్ల మూసివేతకు చర్యలు చేపట్టమని మున్సిపల్ అధికారులకు సూచించామని చెప్పారు.



## ముగిసిన గణపతి నవరాత్ర మహోత్సవాలు



పూర్ణాహుతితో చవితి ఉత్సవాలకు ముగింపు పలుకుతున్న పండితులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో చవితి మహోత్సవాల ముగింపు కార్యక్రమాలను మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చవితి మహోత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి విశేష అభిషేకాలు, పూజలు, లక్షగరిక పూజ నిర్వహించారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామికి పంచహారతులు ఇచ్చారు. వేదపండితుల ఆధ్వర్యంలో పూర్ణాహుతి కార్యక్రమంతో చవితి మహోత్సవాలకు ముగింపు పలికారు. ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు (సతీష్‌రాజు) కార్యక్రమాలను పర్యవేక్షించారు. స్వామికి గ్రామోత్సవం జరిపారు. స్వామివారి ప్రసాదంగా ఉండ్రాళ్లు పంచారు. మేళతాళాల మధ్య స్వామిని ఊరేగించారు. బాణసంచా కాల్చారు. కేరళ వాయిద్యాలు, గరగ నృత్యాలు, విచిత్ర వేషధారణలు ఆకట్టుకున్నాయి. భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. తొమ్మిదో రోజు మంగళవారం రాత్రి 9.15గంటలకు పూజలు అందుకున్న మట్టి గణపతి విగ్రహాన్ని సమీప పంటకాలువలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

### ఏడుగురు హిజ్రాలకు జైలు

కాకినాడ లీగల్: తాళ్లరేవు మండలం లచ్చిపాలెం ఎన్‌హెచ్-16 రహదారిపై వెళుతున్న వాహనదారులను ఆపి వారి పట్ల అసభ్యకరంగా వ్యవహరించడంతో కోరంగి పోలీసులకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై శ్రీనివాస్‌కుమార్ 24వ తేదీన కేసు నమోదు చేశారు. ఏడుగురు హిజ్రాలను మంగళవారం కాకినాడ కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి 24 గంటల జైలు శిక్ష విధిస్తూ కాకినాడ ఒకటో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హెచ్ వీరభద్రుడు తీర్పు చెప్పారు. హిజ్రాలను సెంట్రల్ జైలుకు తరలించాలని న్యాయమూర్తి ఆదేశించారు.

### మాదక ద్రవ్యాలతో ముప్పు

ఆర్‌ఎంసీలో అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రామచంద్రరావు

కాకినాడ క్రైం: మాదక ద్రవ్యాలు నిండు జీవితానికి ముప్పును తీసుకొస్తాయని వైద్య ప్రముఖులు వెల్లడించారు. మాదక ద్రవ్యాల వినియోగ నివారణే లక్ష్యంగా వైద్య విద్యార్థులకు ఆర్‌ఎంసీ యాజమాన్యం ఆర్‌ఎంసీ మెన్ హాస్టల్‌లో అవగాహన సదస్సు నిర్వహించింది. ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి మానసిక, సామాజిక బలహీనతలకు లొంగొద్దని కోరారు. తల్లిదండ్రులు మీ భవితపై కొండంత ఆశతో ఉన్నారని గుర్తు చేశారు. వైద్య విద్యార్థులుగా ఆరోగ్యవంతమైన, ఆదర్శవంతమైన జీవన శైలితో సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఎవరైనా మాదక ద్రవ్యాలు వినియోగిస్తున్నారని తెలిసినా, విక్రయిస్తున్న ఉదంతాలు బయటపడినా తక్షణమే కళాశాల యాజమాన్యానికి సమాచారం ఇవ్వాలన్నారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల ఉన్నత విద్యావంతులు కూడా ఉన్మాదులుగా మారిన దాఖలాలు ఉన్నాయని ఉదాహరణలతో వివరించారు. ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్, డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం సూచనలతో జరిగిన ఈ సదస్సులో సైకియాట్రీ నిపుణులు డాక్టర్ రామచంద్రరావు, డాక్టర్ వరప్రసాద్, ఫోరెన్సిక్ నిపుణులు డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ ఫణికిరణ్, పల్మనాలజీ నిపుణురాలు డాక్టర్ సూర్యకుమారి, హాస్టల్ వార్డెన్ డాక్టర్ వీరయ్య, క్యాంపస్ ఆఫీసర్ డాక్టర్ సతీష్ పాల్గొన్నారు.

### రైలు ఢీకొని విద్యార్థిని మృతి



జాహ్నవి (ఫైల్)

అనపర్తి: స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలో మూసివేసిన ఉత్తర కేబిన్ రైల్వే గేటు వద్ద మంగళవారం రైలు ఢీకొని స్థానికంగా మూడో తరగతి విద్యార్థిని మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక మార్కండేయపురంలో నివాసముంటున్న కె.గంగాధరరావు, భవాని దంపతుల కుమార్తె జాహ్నవి(8) స్థానికంగా గల ఓ ప్రైవేటు స్కూల్‌లో మూడో తరగతి చదువుతోంది. మంగళవారం స్కూల్ వదిలిన తరువాత తన తాతతో ఇంటికి తిరిగి వస్తున్న జాహ్నవి రాజమహేంద్రవరం వైపు నుంచి విశాఖపట్నం వెళుతున్న సూపర్‌ఫాస్ట్ రైలును గమనించకుండా ట్రాకు దాటుతుండగా రైలు ఢీకొట్టడంతో మృతి చెందింది. వార్త తెలుసుకున్న స్థానికులు అధిక సంఖ్యలో రైల్వే గేటు వద్దకు చేరుకున్నారు. కుమార్తె మృతిచెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు విలపిస్తున్న తీరు చూపరులకు కంట తడి పెట్టించింది.

**రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి.....**

అనపర్తి ఐఎల్‌టీడీ ఫ్యాక్టరీ దాటిన తరువాత ఉన్న యార్డు వద్ద రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు సామర్లకోట జీఆర్‌పి పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 45 సంవత్సరాలు ఉంటుందని, 5.6 అంగుళాల ఎత్తు, ఒంటిపై తెలుపుపై నలుపు రంగు గళ్ల టీ షర్ట్, కాషాయరంగు పంచె ధరించి ఉన్నాడని తెలిపారు. అనపర్తి రైల్వే స్టేషన్ మాస్టర్ టి.కొండలరావు ఇచ్చిన సమాచారం మేరకు శవపంచనామా అనంతరం మృతదేహాన్ని అనపర్తి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. జీఆర్‌పీ ఎస్సై బి.లోవరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని, మృతుడి ఆచూకీ తెలిసిన వారు సామర్లకోట రైల్వే పోలీసులను సంప్రదించాలని సూచించారు.



## స్క్వాష్‌లో పాక్‌పై భారత్ గెలుపు

ఆసియా క్రీడల స్క్వాష్ ఈవెంట్‌లో భారత పురుషుల, మహిళల జట్లు శుభారంభం చేశాయి. మంగళవారం జరిగిన లీగ్ మ్యాచ్‌ల్లో భారత మహిళల జట్టు 3–0తో పాకిస్తాన్‌పై... భారత పురుషుల జట్టు 3–0తో తొలుత సింగపూర్‌పై, అదే స్కోరుతో ఖతర్‌పై గెలుపొందాయి. పాక్‌తో జరిగిన పోరులో తొలి మ్యాచ్‌లో 15 ఏళ్ల అనాహత్ సింగ్ 11–6, 11–6, 11–3తో సాదియా గుల్‌పై... రెండో మ్యాచ్‌లో ఆరోసారి ఆసియా క్రీడల్లో ఆడుతున్న జోష్నా చినప్ప 11–2, 11–5, 11–7తో నూర్ అల్ హుదా సాదిక్‌పై... మూడో మ్యాచ్‌లో తన్వీ ఖన్నా 11–3, 11–6, 11–2తో నూర్ అల్ ఐన్ ఇజాజ్‌పై గెలిచారు.

## సచిన్ శుభారంభం

భారత బాక్సర్లు సచిన్ సివాచ్ (57 కేజీలు), నరేందర్ (ప్లస్ 92 కేజీలు) ఆసియా క్రీడల్లో శుభారంభం చేశారు. తొలి రౌండ్‌లో సచిన్ 5–0తో అస్రి ఉదిన్ (ఇండోనేసియా)పై గెలుపొందగా... నరేందర్ తొలి రౌండ్‌లోనే తన ప్రత్యర్థి ఎల్చోరో ఉమట్‌బెక్ (కిర్గిస్తాన్)ను నాకౌట్ చేశాడు.





మధ్యాహ్నం గం.1:30 నుంచి స్పోర్ట్స్–18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

# 'ఆఖిరి' పంచ్ కోసం...

- నేడు ఆస్ట్రేలియాతో మూడో వన్డే
- వరల్డ్ కప్‌కు ముందు చివరి పోరు
- క్లీన్‌స్వీప్‌పై టీమిండియా దృష్టి
- పరువు కాపాడుకునేందుకు ఆసీస్

రాజ్‌కోట్: విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలాంటి స్టార్ బ్యాటర్లు లేకుండానే భారత జట్టు ఆస్ట్రేలియాపై ఇప్పటికే వన్డే సిరీస్ గెలుచుకుంది. ఇప్పుడు వీరిద్దరు మ్యాచ్ ప్రాక్టీస్ కోసం మైదానంలోకి దిగబోతున్నారు. ప్రతిష్టాత్మక ప్రపంచకప్‌లో మరో 11 రోజుల్లో ఇదే ఆసీస్‌తో తొలి మ్యాచ్ ఆడనున్న నేపథ్యంలో దాని కోసం చివరి ట్రయల్‌గా ఇరు జట్లు బరిలోకి దిగుతున్నాయి. మరో నలుగురు ప్రధాన ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చి టీమిండియా తమ సత్తాను పరీక్షించుకునేందుకు సిద్ధం కాగా, ఆసీస్ మాత్రం ప్రధాన ఆటగాళ్లందరినీ ఆడించనుంది. ఆసీస్‌పై తొలిసారి వన్డేల్లో క్లీన్‌స్వీప్ కోసం భారత్ సిద్ధం కాగా, మరోవైపు వరుసగా ఆరో వన్డేలో ఓడిపోకుండా పరువు కాపాడుకోవాలని కంగారూలు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో నేడు ఇరు జట్ల మధ్య సిరీస్‌లో చివరిదైన మూడో వన్డేకు రంగం సిద్ధమైంది. రాజ్‌కోట్ పూర్తిగా బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్ కావడంతో భారీ స్కోరు నమోదు కావడం ఖాయం.

**జోరు కొనసాగిస్తారా...**

ఈ మ్యాచ్ నుంచి భారత జట్టు గిల్, హార్దిక్, శార్దుల్, షమీలకు విశ్రాంతినిచ్చింది. తొలి రెండు మ్యాచ్‌లు ఆడని రోహిత్, కోహ్లి, సిరాజ్, కుల్దీప్, గత మ్యాచ్‌కు దూరమైన బుమ్రా బుధవారం పోరుకు సిద్ధమయ్యారు. ఆటగాళ్లు మారినా ఓవరాల్‌గా భారత జట్టు ప్రదర్శన అద్భుతంగా ఉంది. ఆటగాళ్ల తాజా ఫామ్‌ను బట్టి చూస్తే చివరి వన్డేలోనూ భారత్ పైచేయి సాధించేందుకు అన్ని అవకాశాలూ ఉన్నాయి. ఆసియా కప్ ఫైనల్ తర్వాత సిరాజ్ మళ్లీ తన సత్తా చాటేందుకు సిద్ధమయ్యాడు. బుమ్రా పదునైన బంతులతో ఆసీస్‌ను కట్టడి చేయగలడు. రాహుల్, శ్రేయస్, సూర్యలతో కూడిన బ్యాటింగ్ ఆర్డర్‌తో భారత్ మరోసారి భారీ స్కోరు సాధించగలదు. అనుభవజ్ఞుడిగా తన విలువేంటో అశ్విన్ గత రెండు మ్యాచ్‌లలో చూపించి తన వరల్డ్ కప్ అవకాశాలు మెరుగుపర్చుకున్నాడు. రోహిత్‌తో పాటు ఇషాన్ ఓపెనర్‌గా ఆడతాడు.

**స్టార్క్, మ్యాక్స్‌వెల్ సిద్ధం...**

సిరీస్ ఓడినా వరల్డ్ కప్‌కు ముందు తగినంత ఆత్మవిశ్వాసం ప్రోది చేసుకునేందుకు ఆసీస్‌కు ఇది తగిన వేదిక. అందుకే ఆ జట్టు తమ వన్డే పూర్తి స్థాయి జట్టుతో బరిలోకి దిగనుంది. గత మ్యాచ్ ఆడని కమిన్స్, స్టొయినిస్ తిరిగి జట్టులోకి రాగా, స్టార్క్, మ్యాక్స్‌వెల్ అందుబాటులోకి వచ్చారు. దక్షిణాఫ్రికా సిరీస్‌లోనూ ఆడని స్టార్క్, మ్యాక్స్‌వెల్ తమ ఫామ్, ఫిట్‌నెస్ నిరూపించుకునే ప్రయత్నంలో ఉన్నారు. మంగళవారం వీరిద్దరు సుదీర్ఘ సమయం పాటు సాధన చేశారు. జట్టులో వార్నర్ ఒక్కడే ఫామ్‌లో ఉండగా, స్మిత్ ఇంకా తడబడుతున్నాడు. మిచెల్ మార్ష్ తనదైన శైలిలో చెలరేగాలని ఆసీస్ టీమ్ మేనేజ్‌మెంట్ కోరుకుంటోంది. జంపా, హాజల్‌వుడ్ భారత్‌ను ఎంతవరకు నిలువరిస్తారనేది చూడాలి.


స్మిత్

# 'అయ్యర్ ఆట బహు బాగు'

సునీల్ గావస్కర్

వరల్డ్ కప్‌కు ముందు ఇబ్బంది పెడుతున్న ఒక సమస్యను పరిష్కరించుకునేందుకు ఇండోర్ మ్యాచ్ భారత్‌కు ఉపకరించింది. ఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సిన స్థితిలో నిలిచిన శ్రేయస్ అయ్యర్ ఒక చక్కటి ఇన్నింగ్స్‌తో సత్తా చాటాడు. అతని ఆట ముందు గిల్ శతకం కూడా చిన్నబోయినట్లు అనిపించింది. అర్ధరాత్రి నిద్రలో నుంచి లేపి బ్యాటింగ్ చేయమన్నా సరే తడబడకుండా ఆడే ఫామ్‌లో ఉన్న గిల్‌ను అయ్యర్ వెనక్కి తోసిన తీరు ఈ ఇన్నింగ్స్ ప్రత్యేకతను చూపించింది. ఈ ఇద్దరు ఆటగాళ్ల మధ్య ఇలాంటి సమన్వయం ఉండటం భవిష్యత్తులో భారత క్రికెట్‌కు ఎంతో మేలు చేస్తుంది. జట్టులో తన స్థానం గురించి రేకెత్తిన అన్ని సందేహాలను పటాపంచలు చేసే ఉద్దేశ్యంతో అయ్యర్ బ్యాటింగ్‌కు దిగాడు. అతను కొన్ని ఆకట్టుకునే షాట్లు ఆడిన తీరు సాధారణంగా ముభావంగా కనిపించే కోచ్ ద్రవిడ్ ముఖంపై కూడా చిరునవ్వులు పూయించింది. గిల్ ఎప్పటిలాగే ఒక్క పొరపాటు లేని ఇన్నింగ్స్ ఆడాడు. ఈ మ్యాచ్ ద్వారా భారత్‌కు మేలు చేసిన మరో అంశం అశ్విన్ బౌలింగ్. అతని గురించి సెలక్టర్లు ఏం ఆలోచిస్తున్నారో మరో ఒకటి రెండు రోజుల్లో తేలిపోతుంది కానీ మొహాలీతో పోలిస్తే ఈ మ్యాచ్‌లో అతని బౌలింగ్ మరింత మెరుగ్గా కనిపించింది. వరల్డ్ కప్‌కు ముందు తమ ఆటను సానుబెట్టుకునేందుకు భారత సీనియర్లకు రాజ్‌కోట్ వన్డే అవకాశం కల్పిస్తోంది. మరోవైపు దక్షిణాఫ్రికా నుంచి మొదలైన పరాజయాలకు ఎలా విరామం ఇవ్వాలో తెలియక ఆస్ట్రేలియా జట్టు పరిస్థితి అగమ్యగోచరంగా కనిపిస్తోంది.



# 41 ఏళ్ల తర్వాత...

- ఈక్వెస్ట్రియన్‌లో భారత జట్టుకు స్వర్ణ పతకం
- డ్రెసాజ్ ఈవెంట్‌లో తొలిసారి అగ్రస్థానం
- సంచలనం సృష్టించిన విపుల్, అనూష్, దివ్యాకృతి, సుదీప్తి బృందం
- సెయిలింగ్‌లో రెండు పతకాలు

అశ్వాలతో ముడిపడి ఉన్న క్రీడ ఈక్వెస్ట్రియన్. అశ్వానికి, రైడర్‌కు మధ్య పూర్తి సమన్వయం ఉండాలి. అప్పుడే ఫలితం వస్తుంది. లేదంటే తడబాటు తప్పదు. న్యూఢిల్లీలో ఆసియా క్రీడలు 1951లో మొదలుకాగా... ఇదే వేదికపై 1982లో జరిగిన ఆసియా క్రీడల్లో ఈక్వెస్ట్రియన్‌ను మొదటిసారి ప్రవేశపెట్టారు. నాటి ఆసియా క్రీడల్లో భారత జట్టు మూడు స్వర్ణాలతో అదరగొట్టింది. ఆ తర్వాత భారత జట్టు ఈ క్రీడాంశంలో మళ్లీ పసిడి పతకం సాధించలేకపోయింది. 41 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ చైనా గడ్డపై మళ్లీ భారత అశ్వదళం అద్భుతం సృష్టించింది. విపుల్ హృదయ్ చద్దా, అనూష్ అగర్‌వల్లా, దివ్యాకృతి సింగ్, సుదీప్తి హజేలాలతో కూడిన భారత జట్టు డ్రెసాజ్ టీమ్ ఈవెంట్‌లో మొదటిసారి బంగారు పతకం సాధించి సంచలనం సృష్టించింది. డ్రెసాజ్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు చివరిసారి 1986 సియోల్ ఆసియా క్రీడల్లో కాంస్య పతకం లభించింది. ఈక్వెస్ట్రియన్ క్రీడలో భాగమైన ఈవెంటింగ్, పెగ్గింగ్ ఈవెంట్‌లలో గతంలో భారత్‌కు పసిడి పతకాలు వచ్చినా డ్రెసాజ్ ఈవెంట్‌లో స్వర్ణం రావడం ఇదే ప్రథమం. ఓవరాల్‌గా ఆసియా క్రీడల్లో మూడో రోజు మంగళవారం భారత్‌కు మూడు పతకాలు వచ్చాయి. ఈక్వెస్ట్రియన్‌లో స్వర్ణంరాగా... సెయిలింగ్‌లో ఒక రజతం, ఒక కాంస్య పతకం లభించాయి. షూటింగ్, జూడో క్రీడాంశాల్లో త్రుటిలో కాంస్య పతకాలు చేజారాయి.

హాంగ్జౌ: ఎవరూ ఊహించని విధంగా ఈక్వెస్ట్రియన్ క్రీడాంశంలో భారత బృందం మెరిసింది. 41 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఆసియా క్రీడల్లో ఈక్వెస్ట్రియన్‌లో భారత్‌కు మళ్లీ స్వర్ణ పతకం లభించింది. మంగళవారం జరిగిన డ్రెసాజ్ టీమ్ ఈవెంట్‌లో విపుల్ హృదయ్ చద్దా, అనూష్ అగర్‌వల్లా, దివ్యాకృతి సింగ్, సుదీప్తి హజేలాలతో కూడిన భారత జట్టు 209.205 పాయింట్లు సాధించి పసిడి పతకం సొంతం చేసుకుంది. చైనా (204.882 పాయింట్లు) రజతం, హాంకాంగ్ (204.852 పాయింట్లు) కాంస్య పతకం గెల్చుకున్నాయి.


స్వర్ణ పతకాలతో అనూష్, సుదీప్తి, దివ్యాకృతి సింగ్, విపుల్ హృదయ్

**ఇంటికి దూరంగా...**

ఆసియా క్రీడల చరిత్రలో డ్రెసాజ్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు బంగారు పతకం రావడం ఇదే తొలిసారి. ఈ స్వర్ణ పతకం వెనుక భారత రైడర్ల శ్రమ ఎంతో దాగి ఉంది. విపుల్, అనూష్, దివ్యాకృతి, సుదీప్తి కొన్నేళ్ల క్రితం భారత్ నుంచి యూరోప్‌కు వెళ్లి కుటుంబసభ్యులకు దూరంగా నివసిస్తూ అక్కడే శిక్షణ తీసుకుంటున్నారు. ఆసియా క్రీడల కోసం భారత ఈక్వెస్ట్రియన్ సమాఖ్య వీరి కోసం యూరోప్‌లోనే ట్రయల్స్ కూడా నిర్వహించింది. ఈ నలుగురి అశ్వాలను జర్మనీలో ఏడురోజులపాటు క్వారంటైన్‌లో పెట్టాక ఈనెల 21న చైనాకు తరలించారు. 'ఆసియా క్రీడల్లో స్వర్ణం సాధించడం నమ్మశక్యంగా లేదు. ఇక్కడి దాకా మా అందరి ప్రయాణం ఎంతో కఠినంగా సాగింది. యుక్త వయసులోనే మేమందరం యూరోప్‌కు వచ్చి శిక్షణ తీసుకుంటున్నాం' అని ఇండోర్‌కు చెందిన 21 ఏళ్ల సుదీప్తి వ్యాఖ్యానించింది. 'మేమందరం ఒకరినొకరం ఉత్సాహపరుచుకున్నాం. జాతీయ గీతం వినిపిస్తూ, జాతీయ పతాకం రెపరెపలాడుతుంటే ఆ అనుభూతిని వర్ణించలేం. మా అందరి శ్రమకు తగ్గ ఫలితం స్వర్ణం రూపంలో లభించింది' అని 2017లో యూరోప్ వెళ్లిన కోల్‌కతాకు చెందిన 23 ఏళ్ల అనూష్ తెలిపాడు. జైపూర్‌కు చెందిన దివ్యాకృతి అజ్మీర్‌లోని విఖ్యాత మాయో గర్ల్స్ స్కూల్‌లో ఏడో తరగతిలో ఉన్నప్పుడు హార్స్ రైడింగ్‌పై దృష్టి సారించింది. 2020లో యూరోప్‌కు వెళ్లిన దివ్యాకృతి జర్మనీలో శిక్షణ తీసుకుంది. ముంబైకి చెందిన 25 ఏళ్ల విపుల్ గత పదేళ్లుగా యూరోప్‌లో శిక్షణ తీసుకుంటున్నాడు. లండన్ యూనివర్సిటీ నుంచి అతను బిజినెస్ మేనేజ్‌మెంట్ డిగ్రీ పూర్తి చేశాడు.

### డ్రెసాజ్ అంటే...

ఈక్వెస్ట్రియన్‌లో ఎండ్యూరన్స్, ఈవెంటింగ్, జంపింగ్, పెగ్గింగ్, డ్రెసాజ్ తదితర ఈవెంట్లు ఉంటాయి. డ్రెసాజ్ అనేది ఫ్రెంచ్ పదం. ఆంగ్లంలో దీని అర్థం ట్రెయినింగ్. తన అశ్వానికి రైడర్ ఏ విధంగా శిక్షణ ఇచ్చాడో, వీరిద్దరి మధ్య సమన్వయం ఎలా ఉందో ఈ ఈవెంట్ ద్వారా తెలుస్తుంది. రైడర్ నుంచి వచ్చే సంజ్ఞల ఆధారంగా అశ్వం కనబరిచే పలు కదలికలను జడ్జిలు పరిశీలిస్తారు. అనంతరం సున్నా నుంచి పది మధ్య పాయింట్లు ఇస్తారు. గరిష్టంగా పాయింట్లు సాధించిన జట్టుకు పతకాలు ఖరారవుతాయి. జట్టులో నలుగురు రైడర్లు ఉన్నా... పతకాలు ఖరారు చేసేందుకు టాప్-3 రైడర్ల పాయింట్లను లెక్కలోకి తీసుకుంటారు.

## భారత్ గోల్స్ వర్షం

సింగపూర్‌పై 16–1తో ఘనవిజయం



హాంగ్జౌ: స్వర్ణ పతకమే లక్ష్యంగా ఆసియా క్రీడల్లో బరిలోకి దిగిన భారత పురుషుల హాకీ జట్టు వరుసగా రెండో విజయం నమోదు చేసింది. పూల్ 'ఎ'లో భాగంగా సింగపూర్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 16–1 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (24వ, 39వ, 40వ, 42వ ని.లో) నాలుగు గోల్స్ నమోదు చేయగా... మన్‌దీప్ సింగ్ (12వ, 30వ, 51వ ని.లో) మూడు గోల్స్ సాధించాడు. అభిషేక్ (51వ, 52వ ని.లో), వరుణ్ కుమార్ (55వ, 55వ ని.లో) రెండు గోల్స్ చొప్పున చేశారు. లలిత్ ఉపాధ్యాయ్ (16వ ని.లో), గుర్జంత్ సింగ్ (22వ ని.లో), వివేక్ సాగర్ ప్రసాద్ (23వ ని.లో), మన్‌ప్రీత్ సింగ్ (37వ ని.లో), షంషేర్ సింగ్ (38వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు. సింగపూర్ తరఫున జకీ జుల్కర్‌నైన్ (53వ ని.లో) ఏకైక గోల్ చేశాడు.

## సెయిలింగ్‌లో సూపర్...

హాంగ్జౌ: సముద్రంలో తెర చాపను నియంత్రిస్తూ ముందుకు దూసుకుపోవడమే సెయిలింగ్. ఆసియా క్రీడల్లో మంగళవారం ఈ క్రీడాంశంలో భారత్‌కు రెండు పతకాలు లభించాయి. భోపాల్‌కు చెందిన 17 ఏళ్ల నేహా ఠాకూర్ బాలికల డింగీ ఐఎల్‌సీఏ-4 ఈవెంట్‌లో రెండో స్థానం సంపాదించి రజత పతకం గెల్చుకుంది. అయోధ్యకు చెందిన 29 ఏళ్ల ఇబాద్ అలీ విండ్‌సర్ఫర్ ఆర్ఎస్:ఎక్స్ ఈవెంట్‌లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించాడు. 11 రేసులతో కూడిన డింగీ ఈవెంట్‌లో నేహా 32 పాయింట్లు స్కోరు చేయగా... 14 రేసులతో కూడిన విండ్‌సర్ఫర్ ఈవెంట్‌లో ఇబాద్ అలీ 52 పాయింట్లు సాధించాడు.


నేహా ఠాకూర్


ఇబాద్ అలీ

### పతకాల పట్టిక (టాప్-10)

| దేశం | స్వ | ర | కాం | మొ |
| --- | --- | --- | --- | --- |
| చైనా | 53 | 29 | 13 | 95 |
| దక్షిణ కొరియా | 14 | 16 | 19 | 49 |
| జపాన్ | 8 | 20 | 19 | 47 |
| ఉజ్బెకిస్తాన్ | 5 | 6 | 11 | 22 |
| హాంకాంగ్ | 5 | 4 | 10 | 19 |
| భారత్ | 3 | 4 | 7 | 14 |
| ఇండోనేసియా | 3 | 1 | 5 | 9 |
| చైనీస్ తైపీ | 2 | 3 | 3 | 8 |
| థాయ్‌లాండ్ | 2 | 0 | 5 | 7 |
| ఇరాన్ | 1 | 4 | 5 | 10 |

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.

### భవాని దేవి ఓటమి



ఆసియా క్రీడల ఫెన్సింగ్ ఈవెంట్‌లో భారత స్టార్ ఫెన్సర్ భవాని దేవి పోరాటం ముగిసింది. మహిళల సేబర్ విభాగంలో భవాని దేవి క్వార్టర్ ఫైనల్లో 7–15తో యాకి షావో (చైనా) చేతిలో ఓడిపోయింది. ఈ మ్యాచ్‌లో భవాని గెలిచిఉంటే సెమీఫైనల్ చేరడంద్వారా కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకునేది.

### చేజారిన కాంస్యం



ఆసియా క్రీడల షూటింగ్ ఈవెంట్‌లో భారత్‌కు త్రుటిలో కాంస్యం చేజారింది. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రమితా జిందాల్–దివ్యాంశ్‌లతో కూడిన భారత జోడీ కాంస్య పతక మ్యాచ్‌లో ఓడిపోయింది. రమిత–దివ్యాంశ్ ద్వయం 18–20తో పార్క్ హాజున్–లీ ఉన్‌సియో (కొరియా) జంట చేతిలో ఓటమి పాలైంది.

### క్వార్టర్ ఫైనల్లో సుమిత్



ఆసియా క్రీడల టెన్నిస్ ఈవెంట్ పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్, మహిళల సింగిల్స్‌లో అంకిత రైనా క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో సుమిత్ 7–6 (11/9), 6–4తో బెబిట్ జుకయెవ్ (కజకిస్తాన్)పై, అంకిత 6–1, 6–2తో ఆదిత్య పటాలి (హాంకాంగ్)పై గెలుపొందారు.

## భారత గడ్డపై అతిథులుగా...

వరల్డ్ కప్‌లో పాల్గొనే జట్లు ఒక్కొక్కటిగా భారత్‌కు చేరుకుంటున్నాయి. ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్ ఇప్పటికే భారత్‌లో ఉండగా... మంగళవారం అఫ్గానిస్తాన్ బృందం తిరువనంతపురం చేరింది. న్యూజిలాండ్ టీమ్ రెండు బృందాలుగా భారత్‌కు చేరుకుంటోంది. బంగ్లాదేశ్‌తో మంగళవారం చివరి వన్డే ఆడిన టీమ్ నేడు హైదరాబాద్‌కు రానుండగా... కెప్టెన్ కేన్ విలియమ్సన్ సహా ఇతర ప్రధాన ఆటగాళ్లతో కూడిన జట్టు మంగళవారం రాత్రి పది గంటలకు శంషాబాద్ విమానాశ్రయంలో అడుగు పెట్టింది. పాకిస్తాన్ కూడా బుధవారం రాత్రి హైదరాబాద్ చేరుకుంటుంది.



# తమీమ్ ఇక్బాల్‌పై వేటు

వరల్డ్ కప్‌కు బంగ్లాదేశ్ జట్టు


తమీమ్


హసరంగ

ఢాకా: వన్డే వరల్డ్ కప్‌లో పాల్గొనే 15 మంది సభ్యుల బంగ్లాదేశ్ జట్టును బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) మంగళవారం ప్రకటించింది. సీనియర్ బ్యాటర్ తమీమ్ ఇక్బాల్‌కు ఇందులో చోటు దక్కలేదు. వెన్నునొప్పితో బాధపడుతున్న అతను పూర్తి ఫిట్‌గా లేకపోగా, ఫిట్‌నెస్ సమస్యలు ఉన్న ఆటగాళ్లను జట్టులోకి ఎంపిక చేయరాదంటూ కెప్టెన్ షకీబ్ అల్ హసన్ డిమాండ్ చేయడం కూడా ప్రధాన కారణం. రిటైర్మెంట్ ప్రకటించి, దేశ ప్రధాని జోక్యంతో దానిని వెనక్కి తీసుకొని, కెప్టెన్సీకి రాజీనామా చేసి ఆపై కివీస్‌తో రెండు వన్డేలు ఆడిన తర్వాతా తమీమ్‌కు వరల్డ్ కప్ టీమ్‌లో చోటు దక్కలేదు.

**జట్టు వివరాలు:** షకీబ్ (కెప్టెన్), లిటన్ దాస్, తన్‌జీద్, నజ్ముల్, ముష్ఫికర్, తౌహీద్, మిరాజ్, మహ్ముదుల్లా, మెహదీ హసన్, నసుమ్, మహమూద్, తస్కీన్, షరీఫుల్, ముస్తఫిజుర్, తన్‌జీమ్.

**హసరంగ, చమీరా దూరం...**

కొలంబో: వరల్డ్ కప్‌లో శ్రీలంక తమ ఇద్దరు ప్రధాన బౌలర్లు వనిందు హసరంగ, దుష్మంత చమీరా సేవలు కోల్పోనుంది. గాయాలతో బాధపడుతున్న వీరిద్దరు మెగా టోర్నీకి దూరమయ్యారు.

**జట్టు వివరాలు:** షనక (కెప్టెన్), కుశాల్ పెరీరా, నిసాంకా, కరుణరత్నే, కుశాల్ మెండిస్, సమరవిక్రమ, అసలంక, ధనంజయ, హేమంత, వెలలాగె, తీక్షణ, పతిరణ, కుమార, రజిత, మదుషంక.

వన్డే ప్రపంచకప్ మరో 8 రోజుల్లో

# సినిమా

## నేనివ్వ!


● నవీన్ చంద్ర, సాయిధరమ్ తేజ్, స్వాతి

- స్వాతీ రెడ్డి

''శ్రీకాంత్ తీసిన 'భానుమతి రామకృష్ణ' సినిమాలో చాలా క్లిష్టమైన భావోద్వేగాలు ఉన్నాయి. ఆయన తీసిన ఈ 'మంత్ ఆఫ్ మధు'లోనూ అలాంటి భావోద్వేగాలు కనిపిస్తున్నాయి. ఈ సినిమా మంచి విజయం సాధించాలి'' అని హీరో సాయిధరమ్ తేజ్ అన్నారు. నవీన్ చంద్ర, స్వాతీ రెడ్డి ప్రధాన పాత్రల్లో శ్రీకాంత్ నాగోతి దర్శకత్వం వహించిన చిత్రం 'మంత్ ఆఫ్ మధు'. యశ్వంత్ ములుకుట్ల క్రిషివ్ ప్రొడక్షన్స్, హ్యాండ్ పిక్డ్ స్టోరీస్ బ్యానర్‌పై రూపొందిన ఈ సినిమా అక్టోబర్ 6న విడుదల కానుంది. మంగళవారం జరిగిన కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న సాయిధరమ్ తేజ్ ఈ చిత్రం ట్రైలర్‌ని విడుదల చేశారు. నవీన్ చంద్ర మాట్లాడుతూ– ''మా సినిమాకి మంచి కథ, సినిమాటోగ్రఫీ, మ్యూజిక్.. ఇలా అన్నీ బాగా కుదిరాయి'' అన్నారు. ''ఈ సినిమా చూసినవారు సర్‌ప్రైజ్ అవుతారు'' అన్నారు స్వాతీ రెడ్డి. అలాగే తన భర్త నుంచి స్వాతి విడాకులు తీసుకున్నారనే వార్త ప్రచారంలో ఉంది. ఈ విషయంపై క్లారిటీ ఇస్తారా అని అడగ్గా.. ''నేనివ్వా'' అన్నారు స్వాతి. ''మంత్ ఆఫ్ మధు' అందర్నీ అలరిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు శ్రీకాంత్ నాగోతి. చిత్ర సహనిర్మాత సుమంత్ దామ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రఘువర్మ పేరూరి, నటీనటులు శ్రేయ, రాజా రవీంద్ర, హర్ష, యశ్వంత్ పాల్గొన్నారు.

## మంగళవారం థ్రిల్


● పాయల్ రాజ్‌పుత్

పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో అజయ్ భూపతి దర్శకత్వం వహించిన చిత్రం 'మంగళవారం'. స్వాతీ రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మించారు. ఈ చిత్రాన్ని నవంబర్ 17న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అజయ్ భూపతి మాట్లాడుతూ– ''గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన రస్టిక్ యాక్షన్ థ్రిల్లర్ 'మంగళవారం'' అన్నారు. ''ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. త్వరలో ట్రైలర్ విడుదల చేస్తాం'' అన్నారు స్వాతీ రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం. ఈ చిత్రానికి సంగీతం: బి. అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: దాశరధి శివేంద్ర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సాయికుమార్ యాదవిల్లి.

## ఇక మా ప్రయాణం మారుతుంది

- నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి



''తెలుగు పరిశ్రమలో చెప్పుకోదగ్గ సినిమాలు అరుదుగా ఉంటాయి. మా 'పెదకాపు 1' కూడా అరుదైన చిత్రంగా నిలుస్తుంది. ఈ సినిమా తర్వాత మా ద్వారక క్రియేషన్స్ ప్రయాణం మారుతుంది'' అని నిర్మాత మిర్యాల రవీందర్ రెడ్డి అన్నారు. విరాట్ కర్ణ, ప్రగతి శ్రీవాస్తవ జంటగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వం వహించిన చిత్రం 'పెదకాపు 1'. మిర్యాల సత్యనారాయణ రెడ్డి సమర్పణలో మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మిర్యాల రవీందర్ రెడ్డి విలేకరులతో పంచుకున్న విశేషాలు.

● 'పెదకాపు 1' చిత్రకథకి కొత్త హీరో అయితేనే సహజత్వం వస్తుంది. అందుకే విరాట్ కర్ణని తీసుకున్నాం. సినిమా మొత్తం చాలా సహజత్వంతో ఉంటుంది. ఎక్కడ కూడా సెట్స్ వేయలేదు. 1980 నాటి పరిస్థితులని ప్రతిబింబించేలా రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో నిజమైన లొకేషన్స్‌లో చిత్రీకరించాం. ఒక చరిత్రని కళ్ల ముందు ఎలా చూపించాలో అలానే సహజంగా చూపించారు శ్రీకాంత్ అడ్డాల.

● మా సినిమాని చూస్తున్నప్పుడు నిజ జీవితాన్నే తెరపై చూస్తున్న అనుభూతి కలుగుతుంది. ఒక సామాన్యుడు తన పరిస్థితులను తట్టుకొని బలవంతుడిని జయించాలంటే ఒక యుద్ధమే చేయాలి. మనం అనుకున్నది సాధించాలంటే పోరాటం తప్పితే వేరే మార్గం లేదు.. అదే ఈ సినిమా కథ. కుటుంబం, సమూహం, ప్రాంతం.. ఇలా ఏదైనా నా అనుకొనే వారి కోసం కాపు కాసేవారికి పెదకాపు అనే పేరు ఉంటుంది. ఆ ఉద్దేశంతోనే మేం 'పెదకాపు' టైటిల్ పెట్టాం.

● విరాట్‌ని స్క్రీన్‌పై చూస్తున్నప్పుడు ఒక పెద్ద హీరోని చూసిన అనుభూతి కలిగింది. విరాట్‌ని వైజాగ్ సత్యానంద్‌గారు హీరో ప్రభాస్‌తో పోల్చడం హ్యాపీగా ఉంది. శ్రీకాంత్ అడ్డాలగారు విలన్‌గా చక్కగా సరిపోయారు. మిక్కీ జె. మేయర్ అద్భుతమైన మ్యూజిక్, నేపథ్య సంగీతం ఇచ్చారు. 'పెదకాపు 1' రిలీజ్ తర్వాత 'పెదకాపు 2' ఉంటుంది. ఆ తర్వాత అడివి శేష్‌తో ఓ చిత్రం చేస్తాను. అలాగే 'అఖండ 2'తో పాటు మరో రెండు మూడు కథలు చర్చల్లో ఉన్నాయి.